క్లుప్తంగా

27న ఆదివాసీ విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): మండ కేంద్రంలో ఈ నెల 27న నిర్వహించే ఆదివాసీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పూనెం రామచందర్, చింత సోమరాజు అన్నారు. ఆగస్టు 9న ప్రంపచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించేందుకు సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీశ్, గణేశ్, వెంకటకృష్ణ, లక్ష్మణరావు, పుల్లయ్య, వెంకటేశ్వర్లు, గంగయ్య తదితరులు ఉన్నారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

గోవిందరావుపేట: బీసీ సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పెండెం శ్రీకాంత్‌ను నియమించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ హాజరై శ్రీకాంత్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.

ఏటీఏ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

వాజేడు: మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాల వద్ద శుక్రవారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ మండల నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర సెక్రెటరీ బోదెబోయిన పరమేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, గౌరవ అధ్యక్షుడు ఇర్ప వెంకన్న సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడె జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా రాంభూపతి, గౌరవ అధ్యక్షుడిగా బోదెబోయిన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా భద్రాచలం, కవిత, వెంకటరమణ, కోశాధికారిగా అనిల్, జాయింట్ సెక్రెటరీలుగా ఇర్ప అనంతరావు, కొటెం కవితను, తదితర కమిటీని ఎన్నుకున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

రేగొండ (కొత్తపల్లిగోరి): గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై సాకపురం దివ్య తెలిపారు. శుక్రవారం కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు, అసాంఘిక కార్యకలపాలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. అనంతరం బాలయ్యపల్లిలో ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు.

ఆర్థికసాయం

మంగపేట: మండలంలోని కత్తిగూడేనికి చెందిన బేతమళ్ల భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబానికి శ్రీ రామకృష్ణ సేవాట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ బాడిష నాగరమేష్ శుక్రవారం రూ.5,000 నగదు గ్రామస్తుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు రొడ్డ సుదర్శన్, మండల సత్యం, ముత్యాలు, వీరస్వామి, సత్యం, లాలాజి, శేఖర్, మధుకర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ కేజ్‌వీల్స్ కిందపడి డ్రైవర్ మృతి



మంగపేట: ట్రాక్టర్ కేజ్‌వీల్స్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని బుచ్చంపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై తిరునగరి వెంకటరంగ సూరి తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చంపేటకు చెందిన రాచకొండ మల్లయ్య అనే రైతు పొలంలో ట్రాక్టర్ డ్రైవర్ దీకొండ శేషు(27) పొలంలో కేజ్‌వీల్స్‌తో దమ్ము చేస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాల్వలోకి దూసుకుపోయి చెట్ల పొదవద్ద నిలిచిపోయింది. ట్రాక్టర్‌పై ఉన్న డ్రైవర్ కాల్వల నీటిలో పడిపోగా అతని తలపై కేజ్‌వీల్స్ ఎక్కడంతోపాటు నీళ్లలో మునిగి మృతి చెందాడు. మృతుడి అన్న నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నందనవనంగా ఐటీడీఏ గార్డెన్లు!



ఐటీడీఏ పరిధి హెచ్ఎన్‌టీసీ గార్డెన్లను పరిశీలిస్తున్న పీఓ చిత్రామిశ్రా



నిరుపయోగంగా ఉన్న గార్డెన్‌ను చదును చేస్తున్న డోజర్

- నిరుపయోగంగా ఉన్న గార్డెన్లు ఉపయోగంలోకి..
- ఐటీడీఏ, ఈజీఎస్ ద్వారా పండ్ల, పూలు, వెదురుసాగుకు శ్రీకారం

ఏటూరునాగారం: పదేళ్లుగా నిరుపయోగంగా ఉండి అక్రమణకు గురవుతున్న భూములపై ఐటీడీఏ దృష్టి సారించింది. ఐటీడీఏ గార్డెన్లు నందనవనంగా మారనున్నాయి. గతంలో పండ్లు, పూల మొక్కలను పెంచుతూ గిరిజనులకు ఉపాధి కల్పించడంతోపాటు శిక్షణ కూడా ఇచ్చేవారు. పదేళ్లలో ఐటీడీఏ పీఓలుగా పనిచేసిన అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఆ భూములు సాగుకు ఉపయోగంలోకి లేకుండా పోయింది. ప్రస్తుత పీఓ చిత్రామిశ్రా ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ వద్ద ఉన్న 5 ఎకరాల భూమిలో వెదురుతోపాటు పూలు, పండ్లు, కూరగాయల మొక్కలను ఉపాధిహామీ పథకం ద్వారా నాటించి ఉపయోగంలోకి తీసుకురానున్నారు. ఇందు కోసం ఈజీఎస్, ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి ప్రభుత్వ భూమి ఎక్కడ వరకు ఉంది, ఎవరైనా కబ్జా చేశారా అని సర్వేలను చేపట్టారు. దీంతో కొంత మేర కబ్జా అయిన భూమిని ఐటీడీఏ వారు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఈ రెండు ప్రాంతాల్లో మామిడి చెట్లు ఉండగా వాటిని అలాగే ఉంచి మరికొన్ని నాటి సాగులోకి తీసుకురానున్నారు.



కూల్చివేసిన అక్రమ నిర్మాణాలు

ఎక్కెలలో కూడా..

మండల కేంద్రంలోని ఐటీడీఏకు కూతవేటు దూరంలోని హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్(ఎక్కెల) వద్ద ఉన్న సుమారు 27 ఎకరాల భూమిలో కొంత మేర కబ్జాకు గురైనట్లు ఇటీవల అధికారులు చేసిన సర్వేలో తేలింది. దానిని కూడా స్వాధీనం చేసుకొని ఐటీడీఏ ప్రభుత్వ భూమి ఉన్నంత వరకు హద్దుల చుట్టూ వెదురు సాగు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతి పొందారు. ఈజీఎస్ ద్వారా మొక్కలను నాటించడం, పెంచడం ఇతర పనులు అన్ని కూడా ఈజీఎస్ ద్వారా చేసేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇక్కడ చుట్టూ వెదురుతోపాటు పండ్లు, పూలు, కూరగాయలను పండించి వాటిని మార్కెట్‌లో విక్రయించడానికి లేదా గిరిజన విద్యార్థులకు అందజేసేలా రూపకల్పన చేస్తున్నారు. ఈ పనులు పూర్తి అయితే ఐటీడీఏ పరిధిలోని భూములు సంరక్షణగా ఉంటాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్లాక్‌ల వారీగా విభజన

రెండు ప్రాంతాల్లో ఉన్న భూములను బ్లాక్‌ల వారీగా విభజించి సాగు చేయనున్నారు. ఎక్కెల వద్ద హెచ్ఎన్‌టీసీలో కరండ, పూలు, మామిడి, జామా, మునగ, సపోటా, నిమ్మలను ఒక్కొ రకం ఒక్కొ ఎకరంలో సాగు చేయనున్నారు. అలాగే ఫిష్ ఫాండ్‌ను అరెకరంలో సాగు చేస్తారు. అదేవిధంగా ఏటూరునాగారం గ్రామంలో హెచ్ఎన్‌టీసీలో కరండ, అలంకార, వెదురు, సపోటా, నిమ్మలను ఒక్కొ రకం ఒక్కొ ఎకరంలో సాగు చేయనున్నారు. ఇలా రకరకాల పండ్ల మొక్కలను పెంచేందుకు ఈజీఎస్ ద్వారా అనుమతి పొందారు. ఈ వర్షాకాలంలో గోతులు తీయించి మొక్కలు నాటనున్నారు. మరో ఏడాది వరకు ఈ రెండు ప్రాంతాలు కూడా నందనవనంగా మారనున్నాయి.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు

ములుగు రూరల్: ఉద్యానవన పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి సంజీవరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు మండలం అబ్బాపూర్ సమీపంలో సాగు చేస్తున్న బొప్పాయితోటను ఆయన సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగవుతున్న అయిల్‌పామ్, మామిడి, జామ, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి, పసుపు, కూరగాయల సాగులో వర్షాల కారణంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. పండ్ల మొక్కలు ఒరిగితే మొదళ్ల సమీపంలో మట్టిని ఎగదోయాలని, కర్రల సపోర్ట ఏర్పాటు చేయాలని అన్నారు. పసుపు పంటల్లో నిలిచిన నీటిని తొలగించి ఎకరానికి 2 క్వింటాల వేపపిండి, 50 కేజీల యూరియాను వేసుకోవాలని చెప్పారు. ఆకుమచ్చ, వేరుకుళ్ల తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల బ్లైటాక్స్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వంగ, టమాట, చిక్కుడు వంటి కూరగాయాల సాగుకు అనువైన సమయమని అన్నారు. మామిడి సాగులో కొమ్మలు కత్తిరించిన తరువాత బ్యాక్టరీయా ఆకు మచ్చ తెగులు నివారణకు 10లీటర్ల నీటికి 6 గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్, 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని అన్నారు. 3 సంవత్సరాల వయసు కలిగిన ఆయిల్ పామ్ తోటల్లో చెట్ల మొదట్లో మగ పూత, ఆడపూతను ఆబ్లేషన్ పరికరంతో తీసి వేయాలని, 4 సంవత్సరాల వయసులో ఆయిల్ పామ్ తోటల్లో పరపరాగ సంపర్కానికి ఉపయోగపడే వీవిల్స్ పురుగులను వదలాలని, డ్రిప్ ద్వారా నీటిలో ఎరువులను కరిగించి మోతాదు ప్రకారం అందించాలని సూచించారు. సాగులో అవసరమైన సలహాలు, సూచనలకు 77801 32284, 77023 83263, 89777 14418 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డివిజనల్ అధికారి శ్రీకాంత్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న సంజీవరావు

పాఠశాలను ఏటూరునాగారానికి మార్చాలి

ములుగు రూరల్: మల్లంపల్లి మండలంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ పాఠశాలను ఏటూరునాగారానికి మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవీందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మల్లంపల్లిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక అడవిలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. పాఠశాలలో సూమారు 600మంది విద్యార్థులు చదువుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకేశ్, రమేశ్‌బాబు, యుగేందర్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



వెంకటాపురం(కె): తనిఖీ చేస్తున్న పోలీసులు



ఎస్ఎస్ తాడ్వాయిలో..

వెంకటాపురం(కె): అనుమానితులకు, కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై కొప్పుల తిరుపతి రావు అన్నారు. జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు శుక్రవారం మండల పరిధిలోని బోదాపురం గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపించారు. ఈ తనిఖీల్లో పీఎస్సైలు తిరుపతి రెడ్డి, సాయికృష్ణ, సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలో కాటాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేసి వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వాహనానికి ఇన్సురెన్స్, రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్ర మాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

వార్డెన్, నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి

ఏటూరునాగారం: వాజేడు మండలంలోని అల్బాకలో ఉన్న ఎస్టీ హాస్టల్‌లో పర్మనెంట్ వార్డెన్, నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్ రవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో డీడీ పోచంకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల నుంచి హా స్టల్‌లోవార్డెన్ శాశ్వతంగా లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉండలేని పరిస్థితి ఉందన్నారు. కొంతమంది వ్యక్తులు అసాంఘిక కార్యక్రమంగా మార్చారని ఆరోపించారు. అధికారులు స్పందించి అల్బాక హాస్టల్‌లో వార్డెన్ నియమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హాస్టల్లో మరుగుదొడ్లు మరమ్మతు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోగిల బాలు, ప్రవీణ్, వంశీ పాల్గొన్నారు.



డీడీ పోచంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇద్దరిపై కేసు



అరెస్టు చేసిన వ్యక్తిని చూపుతున్న ఎస్సై

వాజేడు: మండల పరిధిలోని టేకులగూడెం వైకుంఠ ధామం వద్ద గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. టేకులగూడెంలోని వైకుంఠధామం వద్ద కొంత మంది యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. మండలంలోని టేకులగూడెం గ్రామానికి చెందిన జవ్వ గణేశ్, ఏటూరునాగారం మండల పరిధిలోని చిన్న బోయినపల్లికి చెందిన గుడిపటి గణేశ్‌లపై అనుమానం రావడంతో వారిని తనిఖీ చేసినట్లు తెలిపారు. వారి వద్ద రూ.12800 విలువ చేసే 256 గ్రాముల గంజాయి లభించడంతో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మద్దేడు ప్రాంతం నుంచి కొంత సేవించడం కోసం మరికొంత అమ్మడం కోసం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా గుడిపటి గణేశ్ పరారు కాగా జవ్వ గణేశ్‌ను అరెస్టు చేసి ములుగు జ్యుడీషియల్ కోర్టు పంపినట్లు వెల్లడించారు.

పార్టీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- పీఏసీఎస్ చైర్మన్ మోహనరావు

వెంకటాపురం(కె): పార్టీ కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఉంటుందని వెంకటాపురం(కె) పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సునీల్, సాంబశివరావు, సాయికృష్ణ, గార్లపాటి రవి, కొండపర్తి సీతదేవి, కళాధర్, రమేష్, పల్నాటి ప్రకాశ్, మద్దుకూరి ప్రసాద్ ఉన్నారు.

మొరంచవాగు పరిశీలన

వెంకటాపురం(ఎం): మండలంలోని వెల్తుర్లపల్లి సమీపంలోని మొరంచవాగు రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి తెగిపోవడంతో సీఐ దారవు సురేష్, ఎస్సై చల్ల రాజు సందర్శించారు. మొరంచవాగు తెగిపోవడంతో ప్రయాణికులను దారి మళ్లించి భారీకేడ్లు ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు. చెరువుల్లో చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.



మొరంచవాగును పరిశీలిస్తున్న పోలీసులు

మద్యం షాపుల ఏర్పాటుకు ఏకగ్రీవ తీర్మానం



మంగపేట: వివరాలను వెల్లడిస్తున్న ప్రభాకర్



వాజేడు: లక్ష్మీపురంలో..

మంగపేట: మండలంలోని తిమ్మంపేట, మల్లూరు, వాగొడ్డుగూడెంలో మద్యం షాపుల ఏర్పాటుకోసం నిర్వహించిన పెసా గ్రామసభలో గిరిజనులు ఏకగ్రీవంగా తీర్మానిస్తూ చేతులు ఎత్తి శుక్రవారం ఆమోదం తెలిపారు. 2025–27 సంవత్సరాల కాలపరిమితి వరకు మద్యం షాపుల ఏర్పాటుపై ఆయా గ్రామాల గిరిజనుల అభిప్రాయ సేకరణ కోసం ఏటూరునాగారం ఐటీడీఏ పెసా జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మూడు గ్రామాల్లో పెసా గ్రామ సభలను నిర్వహించారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి సాబమూర్తి, జ్మత్, ఎల్లస్వామి, ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, భానోతుబాలాజి పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని లక్ష్మీపురంలో మద్యం షాపు నిర్వహణ కోసం శుక్రవారం పెసా గ్రామసభ నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, పెసా వైస్ చైర్మన్ గుండెబోయిన శరత్, మొబలైజర్ తుమ్మ రమేశ్, చింతూరు గ్రామ పంచాయతీ సెక్రెటరీ అశోక్ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సభకు భారీ సంఖ్యలో గ్రామస్తులు హాజరయ్యారు. 50 మంది కోరం అవసరమై ఉండగా 100 మందికి పైగా చేతులు ఎత్తి గ్రామ సభకు సమ్మతి తెలిపారు. దీంతో మద్యం షాపునకు నిర్వహించిన గ్రామ సభ విజయవంతం అయినట్లు అధికారులు ప్రకటించారు.

న్యాయం చేయాలి

వాజేడు: మండల పరిధిలోని అరుణాచలపురం గ్రామ సమీపంలోని తన భూమిని తనకు ఇప్పించాలని గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఇర్ప వెంకట నర్సమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. సర్వే నంబర్ 69/1 లోని 3 ఎకరాల భూమిని తన భర్త బతికి ఉన్న సమయంలో మండల పరిధిలోని పాయబాట్ల గ్రామానికి చెందిన ఇద్దరు గిరిజనేతర రైతులు కౌలుకు తీసుకున్నారని తెలిపారు. అప్పటి నుంచి తన భర్త మృతి చెందే వరకు దాదాపు ఏడు సంవత్సరాలు కౌలుకు చేసుకుని ఒక్క పైస కౌలు ఇవ్వ లేదన్నారు. 2022లో తన భర్త చనిపోయడని అప్పటి నుంచి వారు అలానే భూమిని ఆక్రమించుకున్నారని వాపోయారు. ఈ విషయంపై అదే సంవత్సరం ఏటూరునాగారం ఐటీడీఏలో ఎల్‌టీఆర్ కేసు నమోదు అయిందని అది ఇప్పుడు ఇయరింగ్‌కు వచ్చిందని తెలిపారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



నిరసన తెలుపుతున్న నర్సమ్మ, తదితరులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



వాజేడు: మాట్లాడుతున్న కుంజ ధర్మారావు



వెంకటాపురం(ఎం): మాట్లాడుతున్న పైడాకుల మల్లేశ్

- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ధర్మారావు

వాజేడు/వెంకటాపురం(కె): స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మారావు అన్నారు. శుక్రవారం వాజేడు మండలంలోని చెరుకూరు, వెంకటాపురం(కె) మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పని చేయాలని అన్నారు. వాజేడు మండల అధ్యక్షుడు జగపతిబాబు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి సతీశ్, రామచంద్ర రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ సీతారామరాజు, సోమరాజు, సాయిబాబు, కృష్ణ మూర్తి, నాగరాజు, ఆంజనేయులు, వెంకటాపురం(కె)లో సతీశ్, రాజశేఖర్, రామచంద్ర రాజు, సునీల్, ఉప్పల కృష్ణమూర్తి, కోముల కిషన్, సతీష్, రమేశ్, సుందర్ తదితరులు ఉన్నారు.



ములుగు రూరల్: మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ నాయకులు సత్తాను చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బీజేపీ ము ఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని అన్నారు. రాకేశ్, సారన్న, మహేందర్, హరీష్, బాబు, నరేష్, పోతురాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధం కావాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడాకుల మల్లేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని నల్లగుంటలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భూక్య జవహర్‌లాల్, జిల్లా నాయకులు జినుకల కృష్ణాకర్ రావు, వైద్యుల తిరుపతిరెడ్డి, మండల నాయకులు కారుపోతుల దేవేందర్, రెడ్డి శ్రీనివాస్, గంగుల రాజ్‌కుమార్, కాసర్ల సురేష్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, సంజీవరెడ్డి, శ్రీనివాస్, శరత్ పాల్గొన్నారు.

లింగాలలో వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఉష

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కోడిశాల పీహెచ్‌సీ పరిధిలోని లింగాలలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ ఉష రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. జ్వరపీడితుల నుంచి రక్తనమునాలను సేకరించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్, ఏఎన్ఎం అనురాధ పాల్గొన్నారు.